ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

గురువారం 14, మార్చి 2024

## అయోధ్య రామయ్య భక్తులకు గుడ్ న్యూస్.

### రామ్ లల్లా హారతి ఇకపై దూరదర్శన్ లో ప్రత్యక్ష ప్రసారం




**ఇయ్యాల్టి న్యూస్, అయోధ్య , మార్చి 13:** అయోధ్య వెళ్లి బాలరాముడిని దర్శించుకోలేని వారికి దూరదర్శన్ ఛానల్ గుడ్ న్యూస్ చెప్పింది. రామ్ లల్లా భక్తులు ప్రతిరోజూ అయోధ్య నుంచి నేరుగా హారతి సేవలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చని డీడీ ఛానల్ వెల్లడించింది. ప్రతి రోజూ ఉదయం 6:30 గంటలకు అయోధ్యలోని రామ మందిరం నుంచి హారతి కార్యక్రమాన్ని ప్రసారం చేస్తామని దూరదర్శన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. అయోధ్య రామాలయాన్ని వీక్షించేందుకు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తున్నారని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) హ్యాండిల్ లో తెలిపింది.

గురువారం 14, మార్చి 2024



## రేపు ఎల్బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు

2



## భారత్ 64 ఏళ్ల కల ఇప్పటికే సాకారమైంది: ప్రధాని మోదీ...

2




## ఓ వైపు మార్నింగ్ వాక్... మరో వైపు సమస్యల ఆరా..

### మారుతీనగర్లో కలియతిరిగిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



మారుతీనగర్ లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మార్చి 13:** ఓ వైపు మార్నింగ్ వాక్ చేస్తూ .. మరో వైపు సమస్య పట్ల ఆరా తీస్తూ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక డివిజన్లో కలియతిరిగారు. మారుతీనగర్ లో ఆయన బుధవారం పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కొత్తగా సీసీ రోడ్డు, డ్రైనేజీ లైన్ తదితర సమస్యలు ప్రస్తావించగా వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వంజరి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ వంజరి సేవా సంఘం డిమాండ్



అంబర్ పేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వంజరి సేవా సంఘం ప్రతినిధులు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మార్చి 13:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ బీసీ కులాలకు ఆదుకోవడానికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ వంజరి సేవా సంఘం రాష్ట్ర కమిటి తెలిపింది. బుధవారం అంబర్ పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ వంజరి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరనారాయణ, ప్రధాన కార్యదర్శి ధాత్రిక ధర్మరాజు, అఖిల భారత వంజరి సేవా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ , ఉద్యోగుల సంఘం నాయకుడు కాలేరు సురేష్, ఉపాధ్యక్షులు ఎదగని హరినాథ్, పోత్నక్ అంజయ్య, కార్యదర్శులు ఎదుగని రామకృష్ణ, మాయ శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ... బీసీలకు పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, వారి కులవృత్తులకు సాంకేతిక జోడించాలన్న ఉద్దేశంతో కులవృత్తులకు సంబంధించి కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని వారు అన్నారు. సంచార గిరిజన జాతికి చెందిన వంజరి కులం వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయ అనుబంధ వృత్తులు చేసుకుంటూ, తెలంగాణ పల్లెల్లో కడు పేదరికం అనుభవిస్తున్నారని కులవృత్తి వ్యాపారము లేక జీవనోపాధికి అనేక చిన్న చిన్న వృత్తుల్లో స్థిరపడిపోయిన వంజరి కులస్తులను గత 77 ఏండ్లుగా ఏ ప్రభుత్వాలు ఏ పథకం ప్రకటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రానికి పూర్వం సంచార వ్యాపారులుగా, బిడారు వర్తకులుగా పేరుగాంచిన వంజరులు బ్రిటిష్ కాలం నుంచి తీవ్ర అణిచివేతకు గురి అవుతున్నారన్నారు. ఏ ఒక్క ప్రభుత్వ పథకం లోగానీ, బీసీ కార్పొరేషన్ ద్వారా గాని, ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా గాని వంజర్లు ఇప్పటివరకు ఎటువంటి లబ్ధి పొందలేదని వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం చొరవ చూపించి వెంటనే వంజరి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో పాటు శాసనమండలి సభ్యుడిగా ఒక వంజరి కులస్తుడికి అవకాశం ఇవ్వాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు

## పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు..

### నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ హర్షం



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మార్చి 13:** పద్మశాలీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై పద్మశాలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఉన్న కార్పొరేషన్లు కేవలం చేనేత ఆధారంగా ఉన్న పద్మశాలి, చేనేత కుటుంబాలకి మాత్రమే అందుబాటులో ఉండేవని అన్నారు. పద్మశాలి జనాభాలో అత్యధిక శాతం వృత్తి వెలుపల ఉన్నారని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం పలు చర్యలు తీసుకోవలసిందిగా గత ప్రభుత్వాలను అభ్యర్థించడం జరిగిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వృత్తి వెలుపల ఉన్న పద్మశాలీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కొరకు పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన తెలిపారు.

## మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం


### ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈరెంటి విజయ్ మాదిగ



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మార్చి 13:** తరతరాలుగా దోపిడీకి, అణిచివేతకు గురవుతున్న దళిత కులాలకు ప్రత్యేక గుర్తింపు కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం కొనసాగిస్తున్నామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈరెంటి విజయ్ మాదిగ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది మాదిగలకు ఒక గౌరవాన్ని తెచ్చిపెట్టి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలలో అధికారంలో ఉండి ఏనాడు కూడా మాదిగలను పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పేదింటి మహిళకు ప్రతి ఏడాది రూ.1 లక్ష ఆర్థిక సాయం

### మహిళలకు కాంగ్రెస్ 5 గ్యారంటీలు




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మార్చి 13:** పార్లమెంట్ ఎన్నికలు సమీపించడంతో... దేశవ్యాప్తంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 'నారీ న్యాయ్ గ్యారెంటీ'ని ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం మహిళలకు ప్రత్యేకంగా ఐదు గ్యారెంటీలను ప్రకటించింది. పేద కుటుంబాల్లోని మహిళలకు ఏడాదికి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ఆ గ్యారెంటీలో తెలిపింది. ఈ నగదును ప్రతి ఏటా పేదల ఖాతాల్లోకి బదిలీ చేస్తామని వెల్లడించింది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా చేపట్టే నియామకాల్లో నారీమణులకు 50 శాతం కోటా ఇవ్వనున్నట్లు తెలిపింది. 'మహాలక్ష్మి', 'ఆది ఆబది-పూరా హక్', 'శక్తి కా సమ్మాన్', 'అధికార్ మైత్రి', 'సావిత్రీబాయి ఫూలే హాస్టల్' అనే ఐదు కీలక వాగ్దాలను మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు రూ.1 లక్ష నగదు బదిలీ... ఆది అబది-పూరా హక్ కింద కేంద్ర ప్రభుత్వంలో చేపట్టే నియామకాల్లో 50 శాతం మహిళలకు ఇవ్వడం... శక్తి కా సమ్మాన్ పథకం కింద ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకంలో విధులు నిర్వర్తించే మహిళలకు నెలవారీ జీతంలో కేంద్రం ఇచ్చే వాటా రెట్టింపు... అధికార్ మైత్రీ పథకంలో న్యాయపరమైన హక్కుల విషయంలో మహిళలను విద్యావంతులను చేసి వారికి సాధికారత కల్పించేందుకు వీలుగా ప్రతి పంచాయతీలో ఒక అధికార్ మైత్రి నియామకం... సావిత్రీబాయి పూలే హాస్టల్స్ పథకంలో భాగంగా ఉద్యోగం చేసే మహిళలకు రెట్టింపు హాస్టల్స్, ప్రతి జిల్లాలో కనీసం ఒక హాస్టల్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓ వీడియోను పోస్ట్ చేశారు. కొత్త రిక్రూట్‌మెంట్ ప్రకారం నియామకాల్లో సగం హక్కు మహిళలకు ఉంటుందని పేర్కొన్నారు. నారీ న్యాయ్ పేరుతో ఖర్గే ఈ హామీలను ప్రకటించారు. మరోవైపు భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న రాహుల్ గాంధీ ఈ గ్యారెంటీలకు సంబంధించి వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

### ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనలో స్వల్ప మార్పు

## కొత్త షెడ్యూల్ ఇదే



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** ప్రధాని నరేంద్రమోదీ మరోసారి రాష్ట్రంలో పర్యటించనున్నారు. 15 ,16,18 తేదీల్లో తెలంగాణల పర్యటిస్తారు. రేపు 15న మల్కాజ్?గిరి పార్లమెంట్ పరిధిలో భారీ రోడ్ షోలో పాల్గొంటారు. 16వ తేదీన నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో, 18న జగిత్యాలలో ఎన్నికల సభకు హాజరవుతారు.కాగా...తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న బీజేపీ ఎన్నికల ప్రచారంలో స్పీడు పెంచింది.

## మరో ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల ప్రకటన



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్ల పోటీ చేసే మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లను మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును ప్రకటించారు. బుధవారం వరంగల్ ముఖ్యనేతలతో జరిపిన చర్చల అనంతరం సమష్టి నిర్ణయాన్ని అనుసరించి వరంగల్ పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను అధినేత కేసీఆర్ ప్రకటించారు.

## సికింద్రాబాద్‌లో నీలిట్ సెంటర్.. వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** సికింద్రాబాద్‌లో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ %ఆ% ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్ ను బుధవారం వర్చువల్ గా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ప్రారంభించారు. యువతకు, మరీ ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నీలిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) మన ప్రాంతంలో ప్రారంభం కానుండటం.. ఈ విద్యాసంవత్సరం నుంచే శిక్షణాతరగతులు ప్రారంభం కానుండటం.. చాలా సంతోషం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుగం నడుస్తోందన్నారు. ఇందులో.. భారతదేశం రానున్న రోజుల్లో పూర్తిగా తన పట్టును పెంచుకుంటోందని కిషన్ రెడ్డి తెలిపారు.

### లోక్ సభ ఎన్నికలకు అన్ని పార్టీల సపోర్ట్ కావాలి

## అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అపర్ణ



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మార్చి 13:** త్వరలో నిర్వహించే లోక్ సభ ఎన్నికలకు అన్ని పార్టీల సహకారం కావాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అపర్ణ కోరారు. బుధవారం జీహెచ్ ఎంసీ అంబర్ పేట సర్కిల్ కార్యాలయంలో డీఎంసీ మారతీ దివాకర్ తో కలసి ఆమె పలు పార్టీల నేతలతో భేటీ అయ్యారు. లోక్ సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని ఆమె కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం ఓటరు జాబితా సవరణతో మార్పులు చేర్పులపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు ఏడెల్లి అజయ్ కుమార్, సీపీఎం నాయకుడు మహేందర్, కాంగ్రెస్ నాయకుడు రామ్మోహన్ తో పాటు పలు పార్టీల నాయకులు ఉన్నారు.




## 72 మందితో బీజేపీ రెండో జాబితా రిలీజ్

### తెలంగాణ నుంచి మరో ఆరుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మార్చి 13**: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ రెండో జాబితాను రిలీజ్ చేసింది. మొత్తం 72 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో తెలంగాణ నుంచి ఆరుగురు అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వారే ఇందులో ముగ్గురు ఉన్నారు. ఖమ్మం, వరంగల్ స్థానాల అభ్యర్థులను పెండింగ్ లో ఉంచింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. నల్గొండ లోక్ సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని ప్రకటించింది .ఆదిలాబాద్-గోడెం నగేశ్

పెద్దపల్లి-గోమాస శ్రీనివాస్, మెదక్-రఘునందన్ రావు, మహబూబ్ నగర్-డీకే అరుణ, మహబూబాబాద్-సీతారాం నాయక్ పేర్లను ప్రకటించగా ఇటీవలే మొదటి జాబితాలో 195 స్థానాల అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదలైన విషయం తెలిసిందే. తెలంగాణ నుంచి బీజేపీ ఫస్ట్ లిస్ట్‌లో 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పుడు ఆరుగురు అభ్యర్థులను ప్రకటించారు. మిగతా ఇద్దరు అభ్యర్థులను త్వరలోనే ప్రకటించనున్నారు.

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

గురువారం 14, మార్చి 2024



# రేవంత్ ప్రభుత్వం పడిపోతే వారిదే బాధ్యత

## బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** తెలంగాణలో కాంగ్రెస్ నేతలు వాళ్లంతట వాళ్లే ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటే బాధ్యత కూడా వారిదే అవుతుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్‌కు మార్గం సుగమం అవుతుందన్నారు. అయిదేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీయేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి ఒప్పందం ఉందని నిన్న సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దీంతో లక్ష్మణ్ దీటుగా కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీఆర్ఎస్‌ను బీజేపీ ఉపేక్షించే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అని... బీఆర్ఎస్‌ను బీజేపీ బతికించదన్నారు.

# అరవై ఏండ్ల వృద్ధుడి కిడ్నీ నుంచి.

## 418 రాళ్లు తొలగించిన హైదరాబాద్ డాక్టర్లు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** కిడ్నీలో ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా 418 రాళ్లు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగకమానదు. హైదరాబాద్ లోని ఏషియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్ యూ) వైద్యులు 60 ఏళ్ల వృద్ధుడి కిడ్నీ నుంచి వందల సంఖ్యలో రాళ్లను వెలికితీశారు. ఆ వృద్ధుడి కిడ్నీ 27 శాతం పనితీరు మాత్రమే కనబరుస్తున్నట్టు గుర్తించారు. కిడ్నీలో భారీ మొత్తంలో రాళ్లు ఉన్నప్పటికీ అత్యాధునిక పరికరాలతో కొద్దిపాటి శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా తొలగించినట్టు ఏఐఎన్ యూ డాక్టర్లు వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ కె.పూర్ణచంద్రారెడ్డి, డాక్టర్ గోపాల్ ఆర్ తక్, డాక్టర్ దినేశ్ పాలుపంచుకున్నారు. శరీరంపై అతి తక్కువ కోతతో కిడ్నీలో రాళ్లను తొలగించే ఈ ఆధునిక వైద్య విధానం పేరు పెర్కటేనియస్ నెఫ్రోలిథోటమీ (పీసీఎన్ఎల్). ఈ విధానంలో లేజర్ ఆధారిత ప్రత్యేకమైన పరికరాలను కిడ్నీలోకి చొప్పిస్తారు. వీటిలో ఓ సూక్ష్మ కెమెరా కూడా ఉంటుంది. తద్వారా శస్త్రచికిత్స నిపుణులు తొలగించవలసిన భాగాన్ని స్పష్టంగా గుర్తించగలుగుతారు. అందువల్ల శరీరంపై ఎక్కువ కోత పెట్టాల్సిన అవసరం ఉండదు. ఈ తరహా శస్త్రచికిత్స అనంతరం రోగి కూడా త్వరగా కోలుకుంటాడు. అయితే, ఈ శస్త్రచికిత్సలో పాలుపంచుకునే వైద్యులు ఎంతో నైపుణ్యం కలిగి ఉండాలి. ఆవిష్కరణల రంగంలో నిజంగా ఇది విప్లవాత్మక విధానం అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కిడ్నీ రాళ్ల బాధితులకు ఇది ఆశాదీపం వంటిదని ఏఐఎన్ యూ డాక్టర్లు అభివర్ణించారు.


# అందుకే అసెంబ్లీ ఫలితాల రోజే కేసీఆర్ నడుము విరగ్గొట్టి దేవుడు శిక్షించాడు: కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** హైదరాబాద్‌లో టానిక్ షాపులు, ఢిల్లీలో మందు షాపులు, కాళేశ్వరం పేరుతో దోపిడీ చేసి దక్షిణ తెలంగాణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాశనం చేశారని... అందుకే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజునే ఆయన నడుము విరగ్గొట్టి దేవుడు శిక్ష వేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డబ్బుల ఆశతో కేసీఆర్ అల్లుడు, కొడుకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోకి వెళితే నీళ్ల సమస్యలతో కళ్ళలో నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిండి, ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయాల్సిందన్నారు. రోజుకు నలుగురు పార్టీ మారుతుంటే బీఆర్ఎస్ ఎక్కడ ఉంటుంది? అని ప్రశ్నించారు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న మొదటి హామీనే అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ మొదటి అయిదేళ్లలో మహిళా మంత్రి లేని రాష్ట్రం కాబట్టే వారి ఉసురు తగిలి కరవు వచ్చిందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. బీఆర్ఎస్ చచ్చిన పాములాంటిదని... ఎంపీ ఎన్నికల్లో ఈసారి ఒక్క సీటూ రాదని జోస్యం చెప్పారు. 24

# జూన్ మాసానికి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల చేయనున్న టీటీడీ

## ఈ నెల 18 నుంచి ఆర్జిత సేవల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్లు



**ఇయ్యాల్టి న్యూస్, తిరుమల, మార్చి 13:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేయనుంది. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆర్జిత సేవల లక్కీ డిప్ వివరాల నమోదుకు అవకాశం కల్పిస్తారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు మరిన్ని ఆర్జిత సేవల టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జ్యేష్ఠాభిషేకం ఉత్సవ టికెట్లను ఆన్ లైన్ లో అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుమలలో జ్యేష్ఠాభిషేకం జూన్ 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవా టికెట్లు, శ్రీవారి దర్శన టికెట్ల కోటా విడుదల చేయనున్నారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు విడుదల చేయనున్నారు. అదే రోజున ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, వసతి గదుల కోటా విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం వృద్ధులు, దివ్యాంగుల కోసం దర్శన టికెట్లు ఆన్ లైన్ లో అందుబాటులోకి తీసుకురానున్నారు.

# ఎన్నికల సభలకు లేని నొప్పి.. అసెంబ్లీకి రావడానికి ఎందుకో

## కేసీఆర్‌పై కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు..!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై టీకాంగ్రెస్ సెటైరికల్ ట్వీట్ చేసింది. అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటూ పార్టీ సభలకు మాత్రం హాజరుకావడం పట్ల వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మంగళవారం కరీంనగర్‌లో బీఆర్ఎస్ కదనభేరి సభకు హాజరైన కేసీఆర్.. కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోశారు. ఈ సభను ఉద్దేశించి బుధవారం టీకాంగ్రెస్ 'ఎక్స్' (గతంలో ట్విటర్) ద్వారా ఘాటుగా స్పందించింది. అసెంబ్లీకి రావాలంటే వచ్చే కాలు నొప్పి ఎన్నికల సభకు పోవడానికి లేదా? అంటూ ప్రశ్నించింది. చట్టసభకు రాకుండా ఉంటున్న మిమ్మల్ని ఎందుకు గెలిపించాలి? అంటూ నిలదీసింది. ఈసారి గెలిపిస్తే సభకు రాకుండా సల్లగా జారుకునేటందుకా? అని ప్రశ్నించింది.
గతంలో మీది దద్దమ్మ ప్రభుత్వం, చేతగాని పాలన అనే ప్రజలు మిమ్మల్ని ఇంటికి పంపించారని విమర్శలు గుప్పించింది. దొరికిన కాడికి దోచుకోవడం ఫాంహౌస్‌లో దాయడం కాంగ్రెస్ పార్టీకి చేతకాదని తెలిపింది. కాగా, కేసీఆర్ తుంటి ఎముక మార్పిడి ఆపరేషన్ జరగడంతో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. అయితే, అదే సమయంలో నల్గొండ, కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సమావేశాలకు హాజరుకావడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

# కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జోరుగా ప్రచారం

## స్పందించిన కడియం శ్రీహరి




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ మారుతున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆయనకు కీలక పదవిని ఆఫర్ చేసిందని, దీంతో ఆ పార్టీలో చేరేందుకు చర్చలు జరుగుతున్నట్లుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఆయన స్పందిస్తూ... తాను పార్టీ మారుతున్నట్లుగా వచ్చే వార్తల్లో ఎలాంటి నిజం లేదన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదని స్పష్టం చేశారు. తనపై కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ వీడటం లేదని... పార్టీని... పార్టీలోని ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామన్నారు.

# రేపు ఎల్బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13 :** ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో తొలి శుక్రవారం 15వ తేదీన ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే ఇఫ్తార్ విందు నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ బుధవారం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా రంజాన్ తొలి శుక్రవారం 15 న సీఎం రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్న సందర్భంగా విస్తృత ఏరాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మొదటి శుక్రవారం సందర్భంగా ఎల్.బి స్టేడియం లో ముస్లిం సోదరులకు సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# నేను పక్కా లోకల్.. వినోద్ నాన్ లోకల్: బండి సంజయ్



**ఇయ్యాల్టి న్యూస్, కరీంనగర్, మార్చి 13:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా కేసీఆర్ కు ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. ఇప్పటికీ అబద్ధాల పునాదుల పైనే బీఆర్ఎస్ నడుస్తోందని విమర్శించారు. నీ పార్టీలో తెలంగాణ పదమే లేనప్పుడు... తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే హక్కు కూడా నీకు లేదని అన్నారు. ఏపీలో ఏడు మండలాలను కలిపిందే కేసీఆర్ అని... ఆ్రఫ్టాల్ ఏడు మండలాలే అని కేసీఆర్ సైలెంట్ గా ఉన్నారని దుయ్యబట్టారు. నువ్వు నిజాయతీపరుడివా? అని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ ను ఉద్దేశించి ప్రశ్నించారు. నిజాయతీపరుడివైతే ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని భూములు ఎందుకు కాజేశారని అడిగారు. తాను లోకల్... వినోద్ నాన్ లోకల్ అని అన్నారు. స్మార్ట్ సిటీ కోసం తొలుత వెంకయ్య నాయుడిని కలిసింది తానేనని... అయితే, తనకు పేరు రాకుండా చేశారని విమర్శించారు.

# నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు..

## నేను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నా : ఆరూరి రమేశ్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మార్చి 13:** తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ స్పష్టం చేశారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని.. తమ పార్టీ నేలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని.. తాను అమిత్‌షాను కలవలేదని తెలిపారు. మరోవైపు ఆయన బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావును కలిశారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆరూరి రమేశ్ చేరుకొని భేటీ అయ్యారు. మరో వైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరుగుతున్నది. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్య నేతలతో కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. భేటీలో కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మధుసూదనచారి, పసునూరి దయాకర్, ఆరూరి రమేశ్, గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతితో పలువురు కీలక నేతలు పాల్గొన్నారు.

# కేఏ పాల్ అక్కడి నుంచే పోటీ చేస్తారు: బాబు మోహన్



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , మార్చి 13:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అధినేత కేఏ పాల్ విశాఖ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలుస్తారని... ఆయనకు మద్దతుగా తాను ప్రచారం చేస్తానని ఇటీవలే ప్రజాశాంతి పార్టీలో చేరిన బాబు మోహన్ స్పష్టం చేశారు. ఇటీవల కేఏ పాల్ మాట్లాడుతూ... తాను విశాఖ నుంచి పోటీ చేస్తానని, బాబు మోహన్ తెలంగాణలోని వరంగల్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేస్తారని చెప్పారు. తాజాగా కేఏ పాల్ పోటీపై బాబు మోహన్ మరోసారి స్పందించారు. ఇదిలా ఉండగా మునుగోడు ఉప ఎన్నికల్లో కేఏ పాల్‌కు 805 ఓట్లు రాగా, 2019లో నర్సాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేయగా 281 ఓట్లు వచ్చాయి.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. రూ. 13 లక్షల కోట్లు ఆవిరి



**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, మార్చి 13:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ కుదుపుకు గురయ్యాయి. బుధవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ చివరి వరకు నష్టపోతూనే వచ్చాయి. ఒకానొక సమయంలో సెన్సెక్స్ 1,100 పాయింట్లకు పైగా నష్టపోయింది. బుధవాకం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 906 పాయింట్లు నష్టపోయి 72,762కి దిగజారింది. నిఫ్టీ 338 పాయింట్లు పతనమై 21,997కి పడిపోయింది. భారీ నష్టాల నేపథ్యంలో రూ. 13 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరయింది. చిన్న, మధ్య తరగతి కంపెనీల షేర్ల విలువ బుడగల్లా పెరుగుతూ వస్తోందని సెబీ చీఫ్ చేసిన వ్యాఖ్యలతో మార్కెట్లు కుదుపుకు గురయ్యాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు.బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:ఐటీసీ (4.49%), ఐసీఐసీఐ బ్యాంక్ (0.59%), కోటక్ బ్యాంక్ (0.44%), బజాజ్ ఫైనాన్స్ (0.33%), హెచ్డీఎఫ్సీ బ్యాంక్ (0.01%). టాప్ లూజర్స్: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-7.28%), ఎన్టీపీసీ (-6.67%), టాటా స్టీల్ (-5.87%), టాటా మోటార్స్ (-4.28%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-3.32%).



## మొగడి గొంతు కోసి చంపేసింది.. ఎందుకంటే...?




**ఇయ్యాల్టి న్యూస్, క్రైమ్ , మార్చి 13:** భార్యాభర్తల మధ్య జరిగిన గొడవల్లో ఎక్కువ శాతం భర్తలే భార్యలను హతమార్చిన సంఘటనలను చూస్తున్నాం. అయితే ఇక్కడ మాత్రం భార్య.. తన భర్తను గొంతు కోసి, రాడ్డుతో కొట్టి హత్య చేసింది. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు నియోజకవర్గంలో చోటుచేసుకుంది. అటెండర్?గా పనిచేస్తున్న నరసమ్మ తన భర్తను కడతేర్చింది. అయితే ఇందులో ఒక ట్విస్ట్ కూడా ఉంది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి మండలం కొత్త మంగంపేటలో దారుణం చోటుచేసుకుంది. భర్తను.. భార్య హత్య చేసిన సంఘటన అక్కడి స్థానికులను కలిచివేస్తోంది. మృతుడు తిమ్మప్ప (46) నిందితురాలు నరసమ్మ ఏపీఎండిసిలో అటెండర్?గా పనిచేస్తుంది. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని.. అలాగే గత మంగళవారం కూడా భార్య నర్సమ్మను భర్త తిమ్మప్ప మద్యం సేవించి ఉరివేసేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు వస్తున్నాయి.భర్త నిత్యం తాగి వచ్చి తనను చిత్రహింసలకు గురిచేసేవాడని తెలుస్తోంది. అయితే నరసమ్మ రోజు తన పడుతున్న వాటిని ఎంతోకాలం ఓపికగా సహించిన నరసమ్మకు ఒక్కసారిగా కోపం కట్టలు తెంచుకుంది. దీంతో నిన్న రాత్రి రోజూ లాగానే మద్యం సేవించి వచ్చిన తిమ్మప్ప గొడవపడి భార్యను ఉరివేసే ప్రయత్నం చేశాడని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆగ్రహావేశాలకు లోనైన నరసమ్మ.. ఆవేశం తట్టుకోలేక భర్తను గొంతు కోసి, రాడ్డుతో కొట్టి చంపిందని స్థానికులు చెబుతున్న సమాచారం. బాధలను తట్టుకోలేక ఇలా చేసినట్లు కొందరు చెబుతున్నారు. ఏది ఏమైనా తాగుబోతు భర్త నుంచి తనను తాను రక్షించుకునే ప్రయత్నంలోనే హత్య చేసినట్లు చెబుతోంది భార్య. మొత్తం మీద తనను చంపబోయిన భర్తను నరసమ్మ గొంతు కోసి, రాడుతో కొట్టి హత్య చేసినట్లుగా స్పష్టంగా అర్థమవుతుంది. దీనిపై పోలీసులు ఎలా కేసు నమోదు చేస్తారో చూడాల్సివుంది.

## ఛీ..ఛీ.. కోడలు కాదు.. కాలకేయి.. మామను దారుణంగా కొట్టిన కోడలు..



ఇయ్యాల్టి న్యూస్, క్రైమ్ , మార్చి 13: చిన్న చిన్న విషయాలకే కొందరు దారుణాలకు పాల్పడుతున్నారు.. మానవత్వాన్ని మరిచి మరి పాశవికంగా వ్యవహరిస్తున్నారు. విచక్షణ కోల్పోయి.. మృగాల్లా మారుతున్నారు.. తాజాగా.. మామపై కోడలు పాశవికంగా దాడి చేసి కొట్టింది.. వృద్ధుడు అని చూడకుండా అమానవీయంగా వ్యవహరించింది. ఇదంతా.. కేవలం సోఫా మీ షర్ట్ పెట్టాడన్న కారణంతో 87 ఏళ్ల వృద్ధుడిని వాకింగ్ స్టిక్ తో చావబాదింది. ఈ దారుణ ఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల ప్రకారం.. కర్ణాటక బెంగళూరుకి చెందిన ఓ కోడలు వృద్ధుడైన తన మామను చేతి కర్రతో చితకబాదిందని.. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి కూతురు ఫిర్యాదు ఆధారంగా మామపై దాడి చేసిన కోడలిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగుళూరుకి చెందిన పద్మనాభ సువర్ణ (87) అనే వృద్ధుడు కుల్‌శేఖర్ ఏరియాలో నివాసముంటున్నాడు. పద్మనాభ కుమారుడు విదేశాల్లో ఉంటుండగా.. తన కోడలు ఉమా శంకరితో కలిసి అతను మంగుళూరులో ఉంటున్నాడు. వాకింగ్ స్టిక్ సహాయంతో అతను తన పనులు తాను చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మామ పద్మనాభ సువర్ణ.. సోఫా మీద షర్ట్ ఉంచాడన్న కారణంతో కోడలు చేతి కర్రతో అతనిపై దారుణంగా దాడి చేసింది. కర్రతో పలుమార్లు దాడి చేసి గాయపరిచింది. వృద్ధుడి కూతురు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి.. కోడలు ఉమా శంకరిని అరెస్టు చేశారు. తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఉమా శంకరి అట్టవార్‌లోని ఎలక్ట్రిసిటీ ప్రొవైడర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. దీనికి సంబంధించిన దృశ్యాలు ఇంట్లో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.. ఈ దారుణానికి సంబంధించిన వీడియోను పలువురు నెటిజన్లు షేర్ చేసి.. నిందితురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పేరుకే ఆ సెంటర్లు.. లోపల జరిగేదంతా అదే.. ఎక్కడంటే..



**ఇయ్యాల్టి న్యూస్, క్రైమ్, మార్చి 13:** విజయవాడలో స్పా సెంటర్లపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక పోలీస్ బృందాలు దాడులు నిర్వహించాయి. మసాజ్ సెంటర్ల ముసుగులో వ్యభిచారం సాగుతోందన్న సమాచారంతోనే ఈ ఆపరేషన్ సాగింది. ఇసుక, మట్టి, మద్యం అక్రమ తరలింపును అరికట్టేందుకు ఏర్పడిన సెబ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు 62 మందితో కూడిన పది బృందాలు ఏకకాలంలో విజయవాడ పరిధిలోకి వచ్చే.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు స్పా సెంటర్లపై ఏకకాలంలో మెరుపు దాడులు చేశాయి. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొంతకాలంగా స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడంతోపాటు క్రాస్ మసాజ్ ముసుగులో వ్యభిచార కార్యక్రమాలు కూడా జరుగుతున్నట్టుగా అందిన సమాచారంతో సోదాలు చేశారు. పటమట, మాచవరం, పెనమలూరు, ఎస్.ఆర్.పేట పరిధిలోని స్పా సెంటర్లపై మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో స్థానిక మహిళలతో పాటు విదేశీ మహిళలతో సైతం వ్యభిచారం నిర్వహిస్తున్నట్టుగా పోలీసులు గుర్తించారు. మొత్తం 10 బృందాలతో ఆరు స్పా సెంటర్లపైన జరిపిన దాడులలో థాయిలాండ్‌కు చెందిన ముగ్గురు విదేశీ మహిళలతో పాటు 24 మంది మహిళలకు విముక్తి కల్పించడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేందుకు వచ్చిన 25 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఐదుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ అక్రమ స్పా సెంటర్ల నిర్వహణను నిలువరించడంలో నిర్లక్ష్యం వహించిన అందరి పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ పేర్కొన్నారు. ఈ దాడులను స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఐజి రవి ప్రకాష్ పర్యవేక్షణలో జరిగాయి.

## టేకాఫ్ సమయంలో కుప్పకూలిన సైనిక విమానం.. 15 మంది దుర్మరణం



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మార్చి 13: పశ్చిమ రష్యాలో సైనిక విమానం కుప్పకూలింది. రష్యా సైన్యానికి చెందిన ఐఎల్-76 రవాణా విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో గత మంగళవారం రాత్రి కుప్పకూలింది. రష్యా రాజధాని మాస్కోకు 125 మైళ్ల దూరంలోగల ఇవనోవో ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 15 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 8 మంది విమాన సిబ్బంది కాగా, మరో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. మంగళవారం రాత్రి విమానం కుప్పకూలింది. ఈ ప్రమాడాన్ని రష్యా రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఘటనపై దర్యాప్తు కోసం హుటాహుటిన పరిశోధకుల బృందం ఇవనోవో ఎయిర్‌బేస్‌కు పంపినట్లు తెలిపింది. ఇవానోవో గవర్నర్ స్టానిస్లావ్ వోస్క్రెసెన్స్కీ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. టేకాఫ్ సమయంలో ఇంజన్‌లో మంటలు చెలరేగడమే ప్రమాదానికి కారణమని రక్షణ శాఖ ప్రకటించింది. విమానం కిందికి దిగుతున్నప్పుడు ఒక ఇంజన్ నుంచి మంటలు రావడానికి సంబంధించిన వీడియోను రష్యన్ మీడియా ప్రసారం చేసింది. నాలుగు-ఇంజిన్ ఐఎల్-76 సైనిక విమానంలో నాలుగు ఇంజన్లు ఉంటాయి. ఇది హెవీ-లిఫ్ట్ రవాణా విమానం. ఇది 1970ల నుంచి సోవియట్, ఆ తర్వాత రష్యా వైమానిక దళం ఈ విమానాన్ని వినియోగించారు.

## భారత్ 64 ఏళ్ల కల ఇప్పటికి సాకారమైంది: ప్రధాని మోదీ




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మార్చి 13: దేశ భవిష్యత్తు అవసరాలు, ప్రాధాన్యాలను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాని మోదీ విమర్శించారు. అందువల్లే దేశంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలు నెలకొల్పడంలో జాప్యం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. బుధవారం రూ.1.25 లక్షల కోట్లు విలువైన సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులోభాగంగా గుజరాత్‌లో రెండు, అస్సాంలో ఒకటి ఏర్పాటుకానున్నాయి. తొలిసారిగా 1960లో సెమీ కండక్టర్ల తయారీ కోసం భారత్ కలలు కన్నదని అప్పటినుంచి దేశాన్ని పాలించిన ప్రభుత్వాలు వాటి ప్రాధాన్యాన్ని గుర్తించలేకపోయాయని మోదీ అన్నారు. భవిష్యత్తు అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టలేకపోవడంతో ఈ రంగంలో భారత్ చాలా వెనకబడిందని కానీ, మా ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమైందని మోదీ తెలిపారు. ఇతరులపై ఆధారపడకుండా భారత్ స్వయంసమృద్ధిగా ఎదగడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని తెలిపారు.

## పిల్లలను కనడమే జాబ్ ..జీతం రూ. 25 లక్షల పైమాటే.. కట్ చేస్తే.. !



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మార్చి 13:** 'పిల్లలను కనండి.. డబ్బులు సంపాదించండి' ఇదేం వింత ఆఫర్ అని అనుకుంటున్నారా.! నిజమేనండీ.. ఓ చైనీస్ కంపెనీ మహిళలకు ఈ వింత ఆఫర్‌ను ప్రకటించింది. 28 నుంచి 42 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు సర్రోగేట్ తల్లులుగా మారితే.. లక్షలు సంపాదించకోవచ్చునని ఆ కంపెనీ ఆన్‌లైన్‌లో ఓ ప్రకటన పోస్ట్ చేసింది. అయితే చైనాలో సరోగసీ చట్టవిరుద్ధం కావడంతో.. ఈ ప్రకటన వెలువడిన కాసేపటికే.. అక్కడి ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌కు చెందిన హుచెన్ హౌస్ కీపింగ్ అనే కంపెనీ మహిళలకు ఈ వింత ఆఫర్ ప్రకటించింది. కంపెనీ ఇచ్చిన ప్రకటన ప్రకారం.. 28 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు సర్రోగేట్ తల్లులుగా మారడం ద్వారా 35,000 అమెరికన్ డాలర్లు(దాదాపుగా రూ. 25 లక్షలు కంటే ఎక్కువ) సంపాదించే అవకాశం ఉంది. అదేవిధంగా.. 29 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలకు కంపెనీ 2,10,000 యువాన్లను(సుమారు రూ. 25 లక్షలు) చెల్లిస్తుంది. 40 నుంచి 42 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు సర్రోగేట్ తల్లులుగా మారితే.. వారికి కంపెనీ 1,70,000 యువాన్లను(రూ. 20 లక్షలు) ఆఫర్ చేసింది. చైనాలో సరోగసీ చట్టవిరుద్ధమైనప్పటికీ, జిన్‌జియాంగ్, షాంఘై ప్రాంతాల్లో ఈ కంపెనీ తమ బ్రాంచులు కొనసాగిస్తుండటం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ ప్రకటన ఇంటర్నెట్‌లో వైరల్ అయిన కాసేపటికే.. అక్కడి స్థానిక ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆఫర్‌తో తాము చాలా కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తున్నామని ప్రభుత్వానికి.. సదరు కంపెనీ తమ వాదనను వినిపించింది. చైనాలో సరోగసీని నిషేధించినప్పటికీ, చట్టపరమైన లొసుగులను ఉపయోగించుకుని ఈ కంపెనీ స్థానికంగా తన వ్యాపారాన్ని యదేచ్చగా కొనసాగిస్తోందని కొందరు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఏదైతేనేం ప్రస్తుతం ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఎలక్టోరల్ బాండ్ల కేసుపై అన్ని వివరాలు గడువులోగా వెల్లడిస్తాం: రాజీవ్ కుమార్



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, మార్చి 13: ఎలక్టోరల్ బాండ్ల కేసుపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలు సుప్రీంకోర్టు గడువులోగా వెల్లడిస్తామని తెలిపారు. ఈ మేరకు మీడియాతో ఆయన అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని చెప్పారు. జమ్ముకశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లు 'ప్రజాస్వామ్య పండుగ'లో ఉత్సాహంగా పాల్గోవాలని అభ్యర్థిస్తున్నట్లు సీఈసీ అన్నారు. కాగా, '2024 ఫిబ్రవరి 15, మార్చి 11 నాటి ఆర్డర్‌లో ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, మార్చి 12న ఎలక్టోరల్ బాండ్ల డేటాను ఎన్నికల సంఘానికి ఎస్‌బీఐ అందించింది' అని ఎన్నికల సంఘం మంగళవారం పోస్ట్ చేసింది.మరోవైపు 2019 నుంచి 2024 వరకు సుమారు 22,217 ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇందులో ఇప్పటికే 22,030 బాండ్లను రిడీమ్ చేసినట్లు వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘానికి బాండ్ల డేటాను సమర్పించినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లో ఈసీకి అందించినట్లు చెప్పింది. రెండు పీడీఎఫ్ ఫైళ్ల రూపంలో పాస్‌వర్డ్ ప్రొటెక్షన్‌తో కూడా ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

## లాంచ్ చేసిన క్షణాల్లోనే పేలిపోయిన జపాన్ తొలి ప్రైవేట్ రాకెట్..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మార్చి 13:** వాణిజ్య పరంగా అంతరిక్షంలో ప్రయోగాలు చేయడానికి ప్రయత్నిస్తున్న జపాన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం ఉదయం నింగిలోకి బయల్దేరిన తొలి ప్రైవేట్ రాకెట్ కైరోజ్%ా% లాంచ్ అయిన సెకన్ల వ్యవధిలోనే పేలిపోయింది. టోక్యోకు చెందిన స్పేస్ వన్ సంస్థ నిర్మించిన కైరోస్ రాకెట్ చిన్న ప్రభుత్వ ప్రయోగ ఉపగ్రహాన్ని తీసుకొని నింగిలోకి ఎగిరింది. అయితే, గాల్లోకి ఎగిరిన క్షణాల్లోనే 60 అడుగుల పొడవైన ఆ రాకెట్ ఒక్కసారిగా పేలిపోయింది. భారీగా పొగ, మంటలు వ్యాపించాయి. ఈ ఘటన పశ్చిమ జపాన్‌లోని వకయమ ప్రిఫెక్చర్‌లోని లాంచ్ ప్యాడ్‌లో చోటు చేసుకుంది. ఈ పేలుడుతో లాంచ్ ప్యాడ్ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది. ఈ ప్రయోగం విజయవంతమై ఉంటే ఆ దేశంలో శాటిలైట్ కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తొలి ప్రైవేట్ సంస్థగా స్పేస్ వన్ అవతరించేది. గాల్లో రాకెట్ పేలిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## మహారాష్ట్రలో నారీ న్యాయ్ కార్యక్రమం... రాహుల్ గాంధీ



**ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, మార్చి 13:** 70 కోట్ల మంది సంపద కేవలం 22 మంది చేతుల్లోనే ఉందని, దేశంలో ప్రతిరోజు 90 శాతం మంది ప్రజలు అన్యాయానికి గురి అవుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అందుకే భారత్ జోడో యాత్ర రెండో విడతలో న్యాయ్ అనే పదాన్ని చేర్చినట్లు తెలిపారు. బుధవారం నారీ న్యాయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, యువకులు, మహిళలను ఇలా అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురి అవుతున్నారని తెలిపారు. భారత దేశంలోని 70 కోట్ల మంది సంపద కేవలం 22 మంది చేతుల్లోనే ఉందని విమర్శించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
గురువారం 14, మార్చి 2024


చూసి ముర్వాలే

## మార్కెట్‌లో కుమారి ఆంటీ క్రేజ్ చూస్తుంటే.. నెక్స్ట్ బిగ్‌బాస్‌నా..!



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13:** కుమారి ఆంటీ, కుమారి ఆంటీ.. ప్రస్తుతం సోషల్ మీడియా నుంచి టీవీ షోల వరకు గట్టిగా వినిపిస్తున్న పేరు. ఎక్కడో ఆంధ్రప్రదేశ్ గుడివాడ నుంచి హైదరాబాద్ వచ్చి, ఒక చిన్న ఫుడ్ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తూ వస్తున్న ఈ మహిళ.. ఒక చిన్న వీడియోతో సోషల్ మీడియా స్టార్ట్ అయ్యిపోయారు. ఆ తరువాత టాలీవుడ్ సెలబ్రిటీస్ నుంచి స్టేట్ సీఎం వరకు మాట్లాడుకునే రేంజ్ కి ఎదిగిపోయారు. ఇంకేముందు ఒకరి క్రేజ్ ని గట్టిగా వాడుకునే మన తెలుగువారు, తెలుగు ఛానల్స్.. కుమారి ఆంటీని తమ ప్రమోషన్స్ కోసం బాగా ఉపయోగించేసుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు చలానా వెయ్యాలన్నా కుమారి ఆంటీ డైలాగ్ కావాలి, ఒక బిజినెస్ ప్రమోషన్ జరగాలన్నా కుమారి ఆంటీ అపిరెన్స్ కావాలి, ఒక టీవీ షో టిఆర్పి పెరగాలన్నా కుమారి ఆంటీ ఎంట్రీ కావాలి. దీంతో ప్రతిరోజు ఏదో విధంగా కుమారి ఆంటీ పేరు వినిపిస్తూనే ఉంటుంది. ప్రస్తుతం తెలుగు టెలివిజన్ షోల్లో, సీరియల్స్ లో కనిపిస్తున్న కుమారి ఆంటీ త్వరలో.. బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్‌బాస్ కి వచ్చిన ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇప్పటికే బిగ్‌బాస్ ఉత్సవ్ లో గెస్ట్ గా పాల్గొని సందడి చేసిన కుమారి ఆంటీని త్వరలో కంటెస్టెంట్ గా కూడా తీసుకు వచ్చేస్తారని ఆడియన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా స్టార్స్ ని కంటెస్టెంట్స్ గా తీసుకు వచ్చిన బిగ్‌బాస్ నిర్వాహకులు నెక్స్ట్ సీజన్ కి కుమారి ఆంటీని కూడా తీసుకు వస్తారేమో చూడాలి.

## హనీమూన్‌కు తీసుకెళ్లి ఫ్రెండ్స్‌తో రాత్రంతా గడపమన్నాడు..


### భర్తపై షాకింగ్ కామెంట్స్ చేసిన హీరోయిన్



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13:** సినీ ఇండస్ట్రీలో ప్రేమ వ్యవహారాలు ఎప్పుడు హాట్ టాపిక్ గానే ఉంటాయి. ప్రేమలు, బ్రేకప్స్, పెళ్లిళ్లు, విడాకులు ఇక్కడ చాలా కామన్..ఇప్పటికే చాలా మంది పెళ్లి పీటలెక్కి సంతోషంగా ఉంటే కొంతమంది విడాకులు తీసుకొని ఇంకా హ్యాపీగాగడిపేస్తున్నారు. బాలీవుడ్ లో ఈ టైప్ వ్యవహారాలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. తాజాగా ఓ హీరోయిన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీని షేక్ చేస్తున్నాయి. డబ్బులు ఎక్కువ వస్తే తన భర్త తనను అమ్మేయాలని చూశాడని తెలిపి షాక్ ఇచ్చింది. ఆ హీరోయిన్ ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరిష్మా కపూర్. ఈ అమ్మడు ఒకప్పుడు బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణించింది. అంతే కాదు ఈ అమ్మడు కరీనా కపూర్ సిస్టర్.
కరిష్మా కపూర్ , అభిషేక్ బచ్చన్ ప్రేమించుకున్నారు. ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఆ తర్వాత అభిషేక్ బచ్చన్.. రాణీముఖర్జీతో ప్రేమాయణం నడిపాడు. కానీ అది కూడా కుదరలేదు. ఫైనల్ గా ఐశ్వర్యారాయ్ ను పెళ్లాడాడు అభిషేక్. ఆతర్వాత కరిష్మా కపూర్..ఢిల్లీకి చెందిన బిజినెస్ మ్యాన్ సంజయ్‌ను పెళ్లాడింది. వీరి వివాహం 2003లో జరిగింది. ఈ ఇద్దరూ 2014లో విడాకులకు తీసుకున్నారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో 2014లో విడాకులకు అప్లై చేశారు 2016లో విడాకులు మంజూరు అయ్యాయి. అప్పటి నుంచి కరిష్మా సోలోగానే ఉంటుంది. తాజాగా కరిష్మా వైవాహిక జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలకు సంబందించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కరిష్మా గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హనీమూన్ కు వెళ్లిన సయమంలో తనను తన భర్త స్నేహితులతో రాత్రంతా గడపాలని ఒత్తిడి చేశాడని తెలిపింది. అంతే కాదు వేలానికి పెట్టి తనను అమ్మేయాలని చూశాడని ఆవేదన వ్యక్తం చేసింది కరిష్మా కపూర్. అంతే కాదు తన తల్లితో కలిసి భర్త తనను కొట్టించాలని చూశారని తెలిపింది కరిష్మా ఇప్పుడు ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

### వేల కోట్లకు అధిపతి.. అయినా సింపుల్ లైఫ్..

## అమీర్ ఖాన్ ఆస్తులు తెలిస్తే మైండ్ బ్లాంకే..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13: బాలీవుడ్ ఇండస్ట్రీలోని టాప్ హీరోలలో అమీర్ ఖాన్ ఒకరు. ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. రేపు (మార్చి 14న) అమీర్ ఖాన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు ఇప్పుడే సోషల్ మీడియా వేదికగా బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు ఫ్యాన్స్. ఆయనకు సంబంధించిన లేటెస్ట్, రేర్ ఫోటోస్, వీడియోస్ నెట్టింట పంచుకుంటున్నారు. ఇటీవలే తన కూతురు ఐరా ఖాన్ వివాహం ఎంతో ఘనంగా జరిపించాడు అమీర్. ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ షూటింగ్ లో బిజీగా ఉన్నారు. లాల్ సింగ్ చద్దా డిజాస్టర్ అనంతరం అమీర్ తన సినిమాలపై మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. త్వరలోనే అమీర్ సినిమాల పై అధికారిక ప్రకటనలు రానున్నాయి. ఇదిలా ఉంటే..ప్రస్తుతం అమీర్ ఖాన్ ఆస్తి వివరాలు.. అతడి వద్ద ఉన్న ఐదు ఖరీదైన వస్తువుల గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. ఇంతకీ అమీర్ ఆస్తులు ఎంత ఉంటాయి ?.. మిగతా విషయాలపై ఓ లుక్కెయ్యండి. అమీర్ ఖాన్ 59వ ఏట అడుగుపెడుతున్నాడు. ఈ వయసులోనూ చాలా ఫిట్‌గా ఉన్నాడు. రోజు ఉదయాన్నే జిమ్ లో కఠినమైన వర్కవుట్స్ చేస్తాడు. సినిమా రంగంలోకి అడుగుపెట్టి మూడు దశాబ్దాలు దాటింది. సినిమా రంగానికి ఆయన చేసిన కృషికి పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆస్తి రూ. 1862 కోట్లు. నటన, చిత్ర నిర్మాణం, బ్రాండ్ ప్రమోషన్ వివిధ పెట్టుబడుల ద్వారా డబ్బు సంపాదిస్తాడు. అమీర్ ఖాన్ లాస్ ఏంజెల్స్‌లో రూ.75 కోట్ల విలువైన మాన్షన్ హౌస్‌ని కలిగి ఉన్నాడు. ఈ ప్రాంతంలో చాలా మంది ప్రముఖులకు నివాసాలు ఉన్నాయి. ముంబైలోని బాంద్రాలో అమీర్ ఖాన్ కు ఓ ఇల్లు ఉంది. 5000 చదరపు అడుగుల విస్తీర్ణం, రెండు అంతస్తులతో ఉంది. ఒక అంతస్తు ఆఫీస్ పనులకు వినియోగిస్తుండగా, మరో అంతస్తు వ్యక్తిగతంగా ఉపయోగిస్తున్నారు. దీని ధర దాదాపు 60 కోట్ల రూపాయలు. అలాగే అమీర్ ఖాన్ కి కార్లంటే పిచ్చి. అతనికి చాలా కార్లు ఉన్నాయి. వీటిలో చాలా లగ్జరీ కార్లు ఉన్నాయి. అతనికి రోల్స్ రాయిస్ ఘోస్ట్ ఉంది. దీని ధర దాదాపు 7-8 కోట్ల రూపాయలు. అమీర్ ఖాన్‌కు మెర్సిడెస్ బెంజ్ ఎస్600 కారు ఉంది. ఈ కారు ధర 10.50 కోట్లు. ఈ కారు చాలా విలాసవంతమైనది. చాలా మంది సెలబ్రిటీలకు సొంతంగా ఫామ్‌హౌస్ క్రేజ్ ఉంటుంది. అదే విధంగా, అమీర్ ఖాన్ పొంచగనిలో 2 ఎకరాల ఆస్తిని కలిగి ఉన్నాడు. దీని ధర 7 కోట్ల రూపాయలు. సమయం దొరికినప్పుడు ఇక్కడికి వెళ్లిపోతాడు. ఈ భూమిని పొందే సమయంలో స్టాంప్ డ్యూటీ కింద 42 లక్షలు చెల్లించాడు.

### మెస్మరైజ్ చేస్తూ...

## సిద్ధి ఇద్నాని సోయగాలు..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13: అందాల భామ సిద్ధి ఇద్నాని.. వైట్ డ్రెస్సులో సోయగాలు ఒలికిస్తూ నెటిజన్లను ఫిదా చేస్తోంది.





### బిగ్ బాస్ మోనాల్ బ్లాస్టింగ్ షో..

## అప్పటికీ ఇప్పటికీ మస్తు మారిపోయింది..!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13:** గుజరాతీ భాషలో వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడుపుతోన్నప్పటికీ మోనాల్ గజ్జర్ సోషల్ మీడియాలోనూ తెగ హడావిడి చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా కొన్ని గ్లామరస్ పిక్స్ వదిలింది. అప్పటికి ఇప్పటికీ మస్తు మారిపోయింది.

### తెలుగు పిల్ల హాలీవుడ్ రేంజ్ గ్లామర్ షో..

## చూస్తే మైండ్ బ్లాకే

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13: తెలుగు హీరోయిన్ శోభిత సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో సందడి చేస్తూ మజాను పంచుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని మెస్మరైజింగ్ ఫొటోలను వదిలింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ పిక్స్‌పై మీరే లుక్కేయండి.



### పడుచు పరువాలతో...

## పరేషాన్ చేస్తున్న ఈషా రెబ్బ..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మార్చి 13: ఈషా రెబ్బ తన కొత్త ఫొటోలను షేర్ చేసారు. ఆ పిక్స్ లో ఈషా తన పడుచు పరువాలతో పరేషాన్ చేస్తోంది.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838